




## (గత సంచిక తరువాయి)

**అభ్యాసం** కూసు విద్య అన్నారు. పత్రికా రచన కూసు విద్యకాదు. అందునా దినపత్రికా రచన అస్సలు కాదు. క్షణక్షణం మీదకి ముసురుకు వచ్చే వార్తల్ని వస్త్రకాళితం పట్టి, నిగ్గు తేల్చి, నికార్సయిన వార్తల్ని పేజీల వారీగా పేర్చడం గొప్ప కళ. అందులో రుచిమరిగిన వారికి ఆనందం ఉంది. ఉత్తేజం ఉంది. వృత్తిని ఒడిసి పట్టుకోగలిగితే 'విద్యుత్తు' ఉంది. నిజానికి ఆవేశంతో, ఆలోచనతో ఊగిపోయే యువకుడికి మంచి శయ్య దినపత్రిక. రోజుకి ఎంతలేదన్నా 90 పేజీల వార్తలు రాసేవాడిని. ఇవికాక ఆదివారం పత్రికకి తప్పనిసరిగా ఏదో వ్యాసం రాసి తీరాలి. కనిపించిన ప్రతి ఇంగ్లీషు వ్యాసమూ తెలుగులోకి అనువాదం అయేది. పరిశోధనా రంగంలో కుక్కగొడుగులు, స్పుత్నిక్‌యుగంలో ప్రేమ పరిణామాలు, ప్రపంచానికి ఆఖరి ఘడియలు, భౌతిక దృక్పథం – పూర్వాపరాలు, వింత చట్టాలూ – కొంత నవ్వూ, కాఫ్యాంతం కావ్యం యిలాగ ఎన్నో, ఎన్నెన్నో ఇవికాక చిత్తూరు పత్రికకి వేరే వ్యాసాలు. ఇవన్నీ ఇప్పటికీ నా దగ్గర ఉన్నాయి.

సాయంకాలం రాసిన వార్త మా కళ్ళముందే అచ్చయి, రాత్రి ఇంటికి చేరేసరికి పత్రికగా మారి చేతికి రావడం, వూళ్ళో జరిగిన ఏ సంఘటనకయినా మేం అక్షరరూపం ఇవ్వగలగడం. దాని వల్ల స్థానికుల మీద ప్రభావం,క్రమంగా ఊళ్ళో పరపతి పెరగడం –యివన్నీ క్రమంగా జరుగుతూ వచ్చాయి. కథ చెప్పేవాడు పాఠకుడి దృష్టిలో ఏదో మెట్టున ఉంటాడు. కాని ఏ రోజుకారోజు వార్తని 'విప్పే'వాడు తప్పనిసరిగా పై మెట్టునే ఉంటాడు. ఇక్కడ పాఠకుడికి సాహితీ పరమైన దృష్టి అక్కరలేదు. సమాజం పట్ల అవగాహన, లోకధర్మాన్ని ఎరగాలన్న ఉత్సుకత, తెలుగు భాష వస్తే చాలు. కథ రసికుడిని ఏకాంతంలో పలకరిస్తుంది. వార్తాపత్రిక ప్రతీ తెలుగువాడినీ బస్‌స్టాండ్‌లోనయినా పలకరిస్తుంది.

దినానికి ఏ రెండుగంటలో ప్రాణం పోసుకునే వార్తాపత్రికలో ముందు ముందు 28 సంవత్సరాలు –వారం వారం – యీ 'తెలుగు'తెలిసిన నేలబారు పాఠకుడి కోసమే కాలం రాశాను. అది ముందు కథ. దినపత్రిక రుచి తలకెక్కడం

ప్రారంభించింది. మరో ఆరు నెలల తర్వాతనేమో శేషయ్యగారు యధాలాపంగా పలకరించారు. "ఒక ఖాళీ వచ్చింది. వారపత్రికకి వెళ్తారా?" అని

"బాబోయ్ ఎక్కడికీ వెళ్ళను"అన్నాను. దినపత్రికలో, మూడేళ్ళు ఉద్యోగం. అదే ముందు జీవితానికి అద్భుతమయిన తర్ఫీదు. నా వృత్తిలో బలమయిన పునాదులు ఏర్పడిన దశ అది.

అప్పుడప్పుడు శేషయ్యగారు ఫోన్‌లో మాట్లాడేవారు. నా రచనలు చూస్తున్నానంటూ ప్రోత్సహించేవారు.

ఆయన ప్రోద్బలం మీదే ఆదివారం పత్రికలో 'కులాసా కబుర్లు' అనే శీర్షిక మొదలుపెట్టాను. అప్పటికింకా రావూరుగారు 'ఆషామాషీ' మొదలు పెట్టలేదు. అయితే వారం వారం రాయడానికి నా దగ్గర ఉన్న సరుకు చాలదు. కాగా, ఆ ప్రక్రియ మీద కూడా అప్పటికి అంతగా అదుపు లేదు. కొన్నాళ్ళు మాత్రం నడపగలిగాను. తర్వాత ఆ శీర్షిక నిలిచిపోయింది.

దినపత్రిక ఆ ఊరు రాగానే స్థానిక రచయితలలో చలనం వచ్చింది. ఆ సంవత్సరమే మొదటిసారిగా చిత్తూరు రచయితల సంఘాన్ని ఏర్పరిచాం. "ఏర్పరిచాం" అనడానికి కారణం తాత్కాలికంగానయినా నేనూ చిత్తూరు రచయితని కావడం. అందరిలోకి సీనియర్ కె. సభాగారు. ఎప్పుడూ ప్రసన్నంగా ఉండే మనిషి. ఆయనకి చిన్న ప్రెస్సు ఉండేది. 'దేవదత్తం' అనే పిల్లల పత్రిక నడుపుతుండేవారు. బాల సాహిత్య రచనలో మంచి పేరున్న రచయిత. మరొక లబ్ధప్రతిష్టులు, అంతే సహృదయులు మధురాంతకం రాజారాంగారు. వారిది పాకాల దగ్గర దామల చెరువు. కథారచనలో వారిదొక ప్రత్యేకమయిన బాణీ. ఇతివృత్తం ఎంపికలోనే వారికొక ప్రత్యేకత. ఏ భాషా ప్రభావాలూ మీద పడని నికార్సయిన తెలుగు కథా రచయిత. కలువకొలను సదానందదీ పాకాలే. మంచి ఆర్టిస్టు కూడా. రాజేంద్ర స్థానిక లైబ్రరీలో పనిచేసేవారనుకుంటాను. వల్లంపాటి వెంకట సుబ్బయ్యకి బాగా తొలిరోజులు. అప్పటి కథా రచన ప్రారంభించిన గుర్తు కూడా నాకు లేదు. వారి నాన్నగారు అశ్వత్థమగారు బాగా గుర్తున్నారు. మొదటిసారిగా స్థానిక గ్రంథాలయంలో రచయితల సమావేశం జరిగింది. మర్నాడు పత్రికలో పెద్ద శీర్షికతో వార్త. ఆ రోజుల్లో ప్రతీ పనిలోనూ దూసుకుపోయే స్వభావం, పక్కవాళ్ళ సెన్సిటివిటీస్‌ని అర్థం చేసుకోని బ్రష్‌నెస్ నాది. అది వయస్సు వేడి, అనుభవం లేమికి నిదర్శనం. స్థానిక ప్రముఖులకి సముచిత స్థానాన్ని ఇవ్వకపోవడం, వార్తా ప్రకటనల్లోనూ పెద్దపీట నాకు నేనే వేసుకోవడం యివన్నీ అక్కరలేని తొందరపాట్లు. అవి తెలియడానికి చాలా సంవత్సరాలు పట్టింది. చిత్తూరు ప్రాంతపు రచయితలంతా చాలా సౌమ్యులు. తమకి నచ్చని వాతావరణం నుంచి తొలిగిపోతారుగాని ఎదిరించరు. అది వారి సంస్కారానికి నిదర్శనం. ఈ

అంశాన్ని వారి దగ్గర నేర్చుకున్నాను. 'నీకీ ఊళ్ళో చాలామంది కిట్టని వాళ్ళున్నారయ్యా' అన్నారు కృష్ణగారు ఓసారి. ఆ రోజుల్లో 'అలాగా' అని ఆశ్చర్యపోయానుకాని యివాళయితే 'ఉండకేమవుతుంది?' అనేవాడినేమో.

ఒకసారి భగవాన్ సత్యసాయిబాబా మా కుటుంబానికంతటికీ పుట్టపర్తిలో ఇంటర్వ్యూ ఇచ్చారు. నన్ను చూస్తూ 'నీకు చాలామంది శత్రువులు ఉంటారు' అన్నారు. నేను వారికి చేసే కీడుకన్నా స్వభావంలో దూకుడు, మాటల వేడీ దానికి కారణమనుకుంటాను. జీవితంలో నా ప్రతిభవల్ల చాలామంది మిత్రుల్ని సంపాదించుకుని, నోటివల్ల కొందరినయినా నష్టపోయాను. వయస్సు వచ్చిన కొద్దీ ఈ నష్టం తగ్గుతూ వచ్చింది కాని పూర్తిగా మాయం కాలేదు. ఇప్పుడిక నోటికి కాస్తపాటి బ్లడ్‌ప్రెజర్ కూడా తోడయింది కనుక. 'అవగాహన' ఈ జబ్బుని కొంత నయం చేసింది కాని, పూర్తిగా నయం చేయలేకపోయింది.

ఒక పక్క ఆఫీసులో రోటరీ మిషన్లు తల బద్దలు కొడుతూండగా రోజంతా రాయడం –ఒక విధంగా మనస్సుకి అలవాటయింది. ఎంత అలవాటయిదంటే యింట్లో ప్రశాంత వాతావరణంలో ఆలోచనలు రానంత అలవాటయింది. ఆంధ్రప్రభకి రాత్రి ఎడిషన్ లేదు. మిగతా రెండు పేపర్లకీ ఉంది. అయినా భోజనం అయాక రాత్రి ఆఫీసుకి వచ్చి ఆ శబ్దం వింటూనే రచనలు చేసుకునేవాడిని.

అప్పట్లో పత్రికలో ఓ వార్త వచ్చింది. ఓ తల్లి అప్పుడే పెళ్ళి చేసుకోబోతున్న కొడుకుని కావలించుకుని విడిచిపెట్టలేదు. కొడుకు ఆమె కౌగిట్లోనే చచ్చిపోయాడు. ఓవర్ వెల్మింగ్ పొసిసివ్‌నెస్ కారణమన్నారు. ఈ అంశం నన్ను అమితంగా ఆకర్షించింది. 'మృత్యువు ఆత్మహత్య' అనే రేడియో నాటిక రాశాను. జనమంచి రామకృష్ణగారు మద్రాసు రేడియో కేంద్రంలో ఈ నాటికని నిర్వహించారు. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి తమ్ముడు ఉమామహేశ్వరరావుగారు మద్రాసు రేడియోలో అనౌన్సర్. ఆయన అద్భుతంగా డిఫెన్స్ లాయర్ పాత్రని నటించారు. కొమ్మూరి పద్మావతీదేవిగారు తల్లి వేషం వేసిన గుర్తు. ఇది నా మనస్సుకి దగ్గరగా వచ్చిన రచన, ప్రయోగం. ఆఫీసులో కూర్చునే 'ఆశయాలకు సంకెళ్ళు' నాటిక, 'నిదురపోయే సెలయేరు ','బ్రతకనేర్చిన మనిషి' కథానికలు రాశాను.

మా అమ్మ, తమ్ముళ్ళతో మొదటిసారి కాంచీపురం వెళ్తున్నప్పుడు దారిలో పక్కన ఓ కలప లారీ బోల్తాపడి ఉంది. ఆ లారీ కిందనుంచి ఓ చెయ్యి కనిపిస్తోంది. ఇది నన్ను బాగా కదిలించిన దృశ్యం. అతను ఎవరై ఉంటారు? అతని కథ ఏమిటి?అదీ 'కీర్తిశేషుడు' అన్న కథకి స్ఫూర్తి. కళ జీవితం నుంచి ఎప్పటికప్పుడు ఆలోచనల్ని ఏరుకుంటూంటుంది. విశ్వనాథవారు వారి ఆత్మకథలో 'సృష్టి యేమియు కొత్తకాదు. కవి యిక్క తెలివి యొక్కటియే. కథని తీసుకుని యౌచిత్యము సమ్రక్షించుకొనుట' అన్నారు.

ఈవిధంగా ఇటు పత్రికా రచన, అటు సాహితీ వ్యాసంగం జోడు గుర్రాల స్వారీలాగ సాగేది. మధ్య మధ్య మధురాంతకం రాజారాం, సదానంద, ఆర్.వి.జి కృష్ణమూర్తిగార్లతో పాకాలలో సరదా సమావేశాలూ, రాజేంద్ర, నేనూ చంద్రగిరి, తిరుపతి యాత్రలూ మధురమయిన జ్ఞాపకాలు.

చిత్తూరికి తనదయిన ప్రత్యేకతలు కొన్ని ఉన్నాయి. చిత్తూరు శ్రీ రామవిలాస సభకి పదిమందికీ తెలిసే పేరు వచ్చింది నాగయ్యగారి వల్ల. అక్కడి నుంచి మద్రాసు చేరిన మహానటుడాయన. రామవిలాస సభ అధ్యక్షులు ఆర్.బి రామకృష్ణం రాజుగారిది బొమ్మ సముద్రం. ఆయన సంగీత నాటక అకాడమీ అధ్యక్షులు కూడా. కార్యదర్శి కె.రామస్వామి అయ్యంగార్ నాకు అత్యంత ఆప్తులయారు. ఆయన లోక్‌సభ రెండవ స్పీకర్ అనంతశయనం అయ్యంగార్ అల్లుడు. (మొదటి స్పీకర్ మావ్‌లంకర్) వారిదీ చిత్తూరే. అక్కడికి రెండు మైళ్ళు కట్టమంచి రామలింగారెడ్డిగారి ఊరు. రెడ్డిగారి పేరు వినగానే 'ముసలమ్మ మరణం' వంటి ఖండికలు వెంటనే జ్ఞాపకం వస్తాయి. రెడ్డిగారు ఇక్కడి నుంచి మా వూరు దాకా వచ్చి ఆంధ్రా యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ చేశారు. ఉద్యోగంలాగకాదు, ఉద్యమంలాగ.

ఆంధ్రప్రభలో చేరిన నెలరోజుల నాటికే నలుగురం కలిసి ఒక యిల్లు తీసుకున్నాం. యామినీ శరణ్, రాధాకృష్ణయ్య, పార్ధసారధి, నేనూ. మేడమీద ఓ గది. కింద ఒకటి. చాలా సౌకర్యంగా ఉండేది. రాగిమాను వీధిలో యిల్లు. ఇంటి యజమాని – కుమారస్వామి రెడ్డి కల్లంగాడ్ అనే గ్రామంలో ఉండేవాడు. మాకు ఏ 15 రూపాయలకో అద్దెకిచ్చిన గుర్తు. అద్దెని అందరం కలిసి భరించేవాళ్ళం.. ఇంట్లో దిగినప్పటి నుంచీ చుట్టుపక్కల వాళ్ళంతా మమ్మల్ని వింతగా చూస్తూండేవారు. దానికి కారణం, ఒక ప్రముఖమయిన పేపర్లో పనిచెయ్యడం, తెల్లారిలేస్తే మేం రాసిన వార్తలతో పేపరు వాళ్ళ చేతుల్లో ఉండడం. యివీ కారణాలనుకునేవాళ్ళం. కుమారస్వామిరెడ్డి కూడా మమ్మల్ని గౌరవంగా చూసేవాడు. ఎప్పుడూ తమ ఊరు రమ్మని మమ్మల్ని ఆహ్వానిస్తూండేవాడు. ఒకసారికే ఆపని సాధ్యపడింది. ఆయనతో కల్లంగాడ్ వెళ్ళాను. షడ్రసోపేతగా భోజనం పెట్టారు. భోజనం అయాక పందిరి పట్టెమంచం మీద హాయిగా నిద్రపోయాను. లేచేసరికి బయట పెద్ద కలకలం వినిపించింది. రెడ్డిగారు వచ్చారు. 'మీకోసం ఊళ్ళో పెద్దలంతా వచ్చారు' అన్నారు. ఆనందంతో కాస్త భుజాలు పొంగాయి. బయటకొచ్చాను. తలపాగాలూ, మీసాలూ, వంగి దండాలూ చాలా గొప్పగా అనిపించింది. ముందు వ్యాసపీఠం మీద భారతం ఉంది. 'భారతం చెప్పండి పంతులుగారూ' అన్నాడు కుమారస్వామి రెడ్డి ఉన్నట్టుండి. నేను బిత్తరపోయాను. 'నేనా! భారతమా! అబ్బెబ్బే. నాకేం రాదు' అన్నాను కంగారుగా. రెడ్డిగారు వినిపించుకోలేదు. 'ఊరుకోండి సార్, మీకు రాకపోవడమేమిటి?' అన్నాడు. ఊళ్ళో వాళ్ళు వంతపాడారు. ఆ రోజుల్లో చదువుకోవడం అంటే భారత భాగవతాలు రావడం అన్నమాట. మా చదువులు వాళ్ళకేం అర్ధమవుతాయి. ఏ చదువూ రాని వారికున్న అవగాహన ఏదో చదువు వెలగబెట్టిన నాలాంటి వాడికి లేనందుకు రహస్యంగా సిగ్గుపడ్డాను. మొత్తానికి భారతం చెప్పందే నన్ను

వదిలిపెట్టలేదు. నాకు తెలిసిన ధోరణిలో తెలిసినట్టు చెప్పాను. దానికే వారు పొంగిపోయి నన్ను సత్కరించారు. నా జీవితంలో అదొక్కటే అర్హత చాలని సత్కారం. అదే మొదటిసారీ ఆఖరుసారీ పురాణ కాలక్షేపం చెయ్యడం.

రోజులు గడిచి మా యింటి చుట్టూ ఉన్న మనుషులు పరిచయం అయాక కొత్త విషయాలు తెలిశాయి. మా యింట్లో ఒకావిడ ఉరి పోసుకు చచ్చిపోయిందట. ఆమె శవాన్ని కింద గదిలో పడుకోబెట్టారట. అప్పటినుంచీ ఆ యిల్లంటే అందరికీ భయం. ఒకాయన చీకటివేళ అటు నడుస్తూ కాలు తడబడి, పడి బెదరిపోయాడట. ఆ బెదురుతో జ్వరం వచ్చింది. క్రమంగా జ్వరం ముదిరింది. తర్వాత చచ్చిపోయాడట. ఇది విన్నాక, ఆ పరిసరాలవారు మమ్మల్ని వింతగా చూడడం, యింటాయన మా మీద రెట్టింపు మర్యాదలు చూపడానికి కారణం అర్ధమయింది. ఈసారి అద్దెకి వచ్చినప్పుడు కుమారస్వామి రెడ్డిని నిలదీశాం. అయినా విషయం తెలిసిందని గ్రహించి వెర్రిమొహం వేశాడు. అప్పటికే నెలలుగా ఉన్న మాకు శవాలు, దయ్యాల భయం కొత్తగా కలిగే అవకాశం లేదు. మరేం చెయ్యాలి? అద్దెని తగ్గించమన్నాం. సమస్య పరిష్కారమయినందుకు ఆనందించి మరోమాట లేకుండా కుమారస్వామిరెడ్డి అద్దె తగ్గించాడు.

చిత్తూరులో ఉన్న మూడేళ్ళలో రెండేళ్ళు వరసగా గూడూరు సంస్కృతీ సమ్మేళనం పోటీలకు వెళ్ళాను. ఒక సంవత్సరం కేవలం రచయితగా. అది 1961. ఆ సంవత్సరం ద్వారం వెంకటస్వామి నాయుడుగారికి, మునిమాణిక్యం నరసింహారావుగారికి, సినీ హాస్యనటుడు రమణారెడ్డిగారికి సన్మానాలు జరిగాయి. మరి రెండేళ్ళ తర్వాత ముని మాణిక్యంగారితో కలిసి హైదరాబాదు రేడియో స్టేషన్‌లో పనిచేసే అవకాశం లభించింది. నా ముందు తరాన్ని సంగీతంతో, రచనలతో సమ్మోహపరిచిన యిద్దరు మహనీయుల్ని చూస్తూ పరవశించిపోయాను.

సాయంకాలం సి.వేణు, కె.వి రమణారెడ్డి కలిసి రచించిన "రాజీవం" నాటిక ప్రదర్శన. ఎంత చక్కగా రాశారో, అంత గొప్పగా ప్రదర్శనా రక్తి కట్టింది. ఆ ప్రదర్శనని చూడడానికి ద్వారం వారు వచ్చారు. వారి పక్కన కూర్చునే నాకు కలిగింది. అటు పక్క వారబ్బాయి భావనారాయణరావుగారు కూర్చున్నారు. ప్రయత్నించకపోయినా వారిద్దరి సంభాషణలు చెవుల్లో పడిన మాటలు భావనారాయణరావుగారి ప్రేమవివాహం వరదమ్మగారి పేరు దొర్లింది.

నాటిక మొదలయాక ద్వారం వారి వేపు చూశాను. ఆయన మాములు సులోచనాలు తీసేసి టెలిస్కోపు లెన్స్‌లాంటి కళ్ళద్దాలు పెట్టుకున్నారు. అప్పటికే చూపు బాగా తగ్గిపోయినట్టుంది. ఆ తర్వాత పూర్తిగా పోయింది.

ఆ మరుసటి సంవత్సరం సంస్కృతీ సమ్మేళనం పోటీలకి న్యాయనిర్ణేతగా వెళ్ళాను. ద్వారం భావనారాయణగారూ, శ్రీనివాస చక్రవర్తిగారూ, నేనూ న్యాయనిర్ణేతలం. ముఖ్య అతిథిగా ధ్వన్యనుకరణ సామ్రాట్ నేరెళ్ళ వేణుమాధవ్‌గారు వచ్చి మూడు రోజులున్నారు. ఆయన విశ్వనాథవారిని అనుకరించే తీరు అద్భుతం. ఆ మూడు రోజులూ ఎప్పుడు, ఏం

మాట్లాడినా విశ్వనాధవారిలాగే మాట్లాడాలని కోరాను. ఇక అన్ని రోజులూ మాకు నవ్వుల జల్లు. ఓ మహాకవి సంస్మరణ. ఉత్సవాలు ముగుస్తూనే నేను, వెంకు, కె.వి.రమణారెడ్డి, భుజంగరాయశర్మగారలు అంతా కలిసి వెంకటగిరి చేరాం. అక్కడ కె. వెంకటేశ్వరరావుకి సన్మానం, మా అందరి ఉపన్యాసాలూ.

ఆంధ్రప్రభ ఉద్యోగానికి సంబంధించిన రెండు ముఖ్యమయిన సంఘటనలు ఉటంకించాలి. ఇప్పటి తిరుపతి వేంకటేశ్వర వైద్య కళాశాల 1960 జులై 26న ప్రారంభమయింది. నీలం సంజీవరెడ్డిగారు ప్రారంభించారు. మంత్రులు పి.వి.జి రాజు, కాసు బ్రహ్మానందరెడ్డిగార్లు వచ్చారు. అప్పటి ఆరోగ్యశాఖా మంత్రి రాజుగారు, జి.గోవిందరాజులు నాయుడుగారు మొదటి వైస్ ఛాన్సలర్. ఆ ప్రారంభోత్సవానికి నేనూ, జి. కృష్ణగారూ హాజరయ్యాం. పత్రికలో వార్త రాశాం.

మరొక గొప్ప ఫీటు – ఆనాటి నాయకులకే ఆశ్చర్యం కలిగించిన విషయం. చిత్తూరు లోక్‌సభ పార్లమెంటరీ నియోజక వర్గ పోటీలకి కాంగ్రెస్ మహాసభ చిత్తూరులో జరిగింది. ఆసభలో నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, ఎస్.బి.పి పట్టాభిరామారావు, కామరాజ నాడార్, అనంతశయనం అయ్యంగార్ ప్రభృతులున్నారు. సభ మొదలుపెట్టినప్పటి నుంచి వార్తలురాసుకుంటూ పోయి ఆఖరి ప్రసంగం పూర్తయి, నాయకులు వేదిక దిగే టైముకి ముందు ప్రసంగాల పూర్తి పాఠాలతో దినపత్రిక కాపీ వారి చేతుల్లో ఉంచాం. పత్రిక చూసి నాయకులే ఆశ్చర్యపోయారు. ఇది కేవలం కృష్ణగారి దక్షతకీ, ఆత్మవిశ్వాసానికీ మచ్చు తునక. ఇదే పత్రికా రచన మత్తు, శక్తి. నిజమయిన జర్నలిజం అంటే దినపత్రికలో పనిచేయడమే. అదిన్నీ – ఆనాటి ప్రముఖ దినపత్రిక – ఆంధ్రప్రభ.

నేను మొదటినుంచీ చలంగారి అభిమానిని. దాదాపు వారి పుస్తకాలన్నీ కాచి వడబోశాను. ముఖ్యంగా మ్యూజింగ్స్, ప్రేమలేఖలు ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. శరత్ సాహిత్యం తర్వాత అంత క్షుణ్ణంగా చదివింది చలంగారివే. చలంగారు చిత్తూరు దగ్గరగానే తిరవణ్ణామలైలో ఉన్నారనగానే మనస్సు ఆనందంతో ఉక్కిరిబిక్కిరయింది. త్వరగా అక్కడికి దూకెయ్యాలని ఉరకలు వేసింది.

ఓ వారాంతంలో శలవు పెట్టుకుని నేనూ, యామినీ శరణ్ బయలుదేరాం. చిత్తూరు నుంచి రాయ్‌వెల్లూరు దాకా బస్సు. అక్కడ తిరువణ్ణామలైకి బస్సు మారాలి. తిరువణ్ణామలై అత్యద్భుతమైన జ్యోతిర్లింగ క్షేత్రమన్న స్పృహలేదు అప్పట్లో. చలంగారు ఉన్న ఊరు. అంతే దృష్టి.

రమణాశ్రమానికి ఎదురుగ్గా మరొక చిన్న ఆశ్రమం చలంగారిది. ఆవరణలో అప్పట్లో అదే ఆకరి యిల్లు. చుట్టూ అరటి చెట్లూ, పూలమొక్కలూ – ఉద్యానవనం మధ్య పొదరిల్లులాగా ఉంది.

ఆవేశంతో ఊగిపోతూ, అన్యాయాల్ని చీల్చి చెండాడి, హిపోక్రసీని తూర్పారబెట్టే యోధుణ్ణి చూస్తాననుకున్నాను. కాని యిదేమిటి? గళ్ళలుంగీతో, గుడ్డ బనీనుతో, మాసిన గెడ్డంతో ముఖమంతా నవ్వు చేసుకున్న ఓ శాంతమూర్తిని చూశాను. రచయిత చలానికి పూర్తిగా విపర్యయం – యిప్పటి చెలమూ, యిక్కడ జీవితమూను.

అతిథుల ముఖాలు తెలియకపోయినా, పేరులు తెలియకపోయినా పరవాలేదు. అక్కడ ఆతిథ్యం లభిస్తుంది. ఆ యింటికి ఎదురుగ్గా వంద గజాల దూరంలో మరో యిల్లు అద్దెకి తీసుకున్నారు. ఆ యింటిని బసవరాజుగారనే ఆయన చూసుకునేవారు.

చలంగారమ్మాయి సౌరీస్, పెంపుడు కూతురు నర్తకి, మరో అమ్మాయి పకపక, ఆమె భర్త వజీర్ రెహ్మాన్. వీరు కాక వచ్చీపోయేవారూ. ఇదీ ఆశ్రమంలో జనాభా. ఇంటిముందు ఆవరణలో నులకమంచం మీద పడుకున్న కొమ్మూరి పద్మావతీదేవిగారిని (పాకాల రాజమన్నార్ నాటిక 'తప్పెవరిది?'లో 1923 ప్రాంతంలో మద్రాసు మ్యూజియం థియేటర్‌లో బళ్ళారి రాఘవతో స్టేజి ఎక్కిన తొలి కుటుంబ మహిళ అని చెప్పుకునేవారు. మాకు తెలిసి ప్రముఖ డిటెక్టివ్ నవలా రచయిత కొమ్మూరి సాంబశివరావుగారి తల్లిగారు) మొదటిసారి అక్కడే చూశాను. వచ్చిన అతిథులందరికీ ఉచితంగానే భోజనాలు, కాఫీలూ, టిఫిన్లు. ఓ క్రమశిక్షణ, టైం పాటించేవారు. సాయంకాలం విధిగా భజన ఉండేది. అక్కడే తొలిసారి జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రిగారిని కలిశాను. నిజానికి వెంపటి రాధాకృష్ణ పక్కనే కూర్చుని జపం చేసుకుంటున్న ఆయన్ని నాకు పరిచయం చేశారు రాధాకృష్ణ 'మా రుక్కాయ్' అంటూ. మద్రాసు నుంచి యామిజాల పద్మనాభస్వామిగారు వచ్చారు. బొబ్బిలి నుంచి కూర్మారావు అనే ఒక యువ రచయిత వచ్చాడు. మా అందరికీ జలసూత్రం, వారి కబుర్లూ కాలక్షేపం. ప్రతీ మాటలో హాస్యం, వ్యంగ్యం, విసురూ, అమితమైన మేధా సంపన్నతా ద్యోతకమయేది. ఆ తర్వాత మేమిద్దరం రేడియోలో కలిసి పనిచేశాం. జలసూత్రం కూర్మారావుని 'కవి కూర్మం, కూర్మ కవి, కోడి కూర్మారావు అని పిలిచేవారు. తర్వాత నేనూ 'మారుతీపూడి గిల్లారావు' నయిపోయాను. ఆ మూడురోజులూ కావ్య కంఠ గణపతి శాస్త్రి, వారు రమణ మహర్షిని 'భగవాన్' అని పిలవడం, తిరువణ్ణామలై క్షేత్ర ప్రాశస్త్యం, గణపతి శాస్త్రిగారి ఉమాసహస్రం – ఒకటేమిటి ఆయన ఏం చెప్పినా అది కొత్త విషయమే. అప్పుడాయన చలం గారి 'మహాస్థాన్' చదువుతున్నారు. చలంగారింట్లో అంతా ఏదో గొప్ప ఆదర్శాన్ని నిరూపించడానికి జీవిక సాగిస్తున్న మిషనరీలలాగ కనిపించేవారు. నా డైరీలో సౌరీస్‌ని చూస్తే సెంట్ జోన్ గుర్తొచ్చిందని రాసుకున్నాను. అంత ప్రశాంతంగా ఆమె

కనిపించేవారు. ఎప్పుడు ఉత్తరం రాసినా ఓ పోస్టు కార్డు సమాధానం వచ్చేది చలంగారి నుంచి. ఆ తర్వాత సంవత్సరాల తరబడి ఉత్తర ప్రత్యుత్తరాలు సాగాయి.

నేను ఆంధ్రప్రభలో ఉన్న రోజుల్లో మా అమ్మ, తమ్ముళ్ళు చిత్తూరు వచ్చారు. నా నూరు రూపాయల జీతంలో ఆవిడ సౌకర్యానికి ఓ టేబుల్ ఫాన్ కొన్నాను. ఆమెకి ఓ కంచి పట్టుచీర కొన్నాను. ఇవి నూర్రూపాయల జీతగాడి ఘనవిజయాలు. వాళ్ళని కాంచీపురం తీసుకెళ్ళాను. శంకరంబాడి సుందరాచారి (మా తెలుగు తల్లికి – గీత రచయిత) స్వయంగా విష్ణు కంచి చూపించి, ఆయనే స్వయంగా వంటచేసి వడ్డించారు. దాదాపు 45 సంవత్సరాల తర్వాత ఈ మధ్య ఉళహలంద పెరుమాళ్ (భూమిని కొలిచిన దేవుడు) ఆలయాన్నివెదుక్కుంటూ వెళ్ళి ఆనాటి జ్ఞాపకాలని పునరుద్ధరించుకున్నాను.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments